క్లుప్తంగా

రీసర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అధికారులు

తవణంపల్లె: భూరీసర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని జేసీ శ్రీనివాసులు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సోమవారం మండల రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భూరీసర్వేను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. జగనన్న సురక్ష పథకం కింద లబ్ధిదారులకు ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని ఆదేశించారు. స్పందనలో వచ్చిన అర్జీలకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి, ఏఓ రెడ్డిబాబు, వ్యవసాయ అధికారి ప్రవీణ్ పాల్గొన్నారు.

రోడ్డు ఏర్పాటుకు వినతి



వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తిరుపతి: పూతలపట్టు నుంచి పెనుమూరు మండలంలోని అడవిపల్లె వయా కలికిరి కొండ తారు రోడ్డు వరకు రహదారి మంజూరు చేయాలని టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, జేఈఓ వీరబ్రహ్మంకు పూతలపట్టు వైఎస్సార్‌సీపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఉదయం తిరుమలలో చిత్తూరు డీఎఫ్ఓ చైతన్య కుమార్ రెడ్డితో కలిసి టీటీడీ ఈఓ, జేఈఓలకు మర్యాదపూర్వకంగా కలిశారు. అటవీశాఖ అధికారులు రహదారి ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నారని.. రోడ్డుకు కావాల్సిన నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందించారు. పాలక మండలి సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వారు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు గౌహతి రెడ్డి, సుధీర్ కుమార్ రెడ్డి, దయాశేఖర్ రెడ్డి, ప్రత్యూష ఉన్నారు.

లో ఓల్టేజీ సమస్యకు పరిష్కారం



నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన విద్యుత్‌శాఖ అధికారులు

యాదమరి: మండల పరిధిలోని ముద్దురామాపురం సబ్‌స్టేషన్ పరిధిలో ఓల్టేజీ సమస్య పరిష్కారం అయినట్లు విద్యుత్ శాఖ ఏఈ గుర్రప్ప తెలిపారు. సోమవారం ముద్దరామపురం సబ్‌స్టేషన్‌లో రూ.1.30 కోట్ల వ్యయంతో నూతనంగా 3.15 కెపాసిటీ నుంచి 8 కెపాసిటీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. తిరుపతికి చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌ల ఈఈ మహేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో చిత్తూరు విద్యుత్‌శాఖ ఏడీ కొండయ్య, విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

హమాలీలకు దుస్తుల పంపిణీ



హమాలీలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్: జాగ్రీ హమాలీ వర్కర్స్ యూనియన్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి హమాలీలకు దుస్తులు పంపిణీ చేశారు. నగరంలోని ఆయన ఇంటి వద్ద సోమవారం సుమారు 100 మందికి దుస్తులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హమాలీల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శేఖర్, రాజా, వైఎస్సార్‌సీపీ నాయకులు కేపీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం సీజ్



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: కర్ణాటక మద్యాన్ని తీసుకొస్తున్న శివకుమార్ (41) అనే వ్యక్తిని చిత్తూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) రూరల్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఐరాల మండలం ఇరువారంపల్లె క్రాస్ వద్ద ఎస్ఈబీ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఇదే గ్రామానికి చెందిన శివకుమార్ అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై కర్ణాటకలోని నంగిలి నుంచి మద్యాన్ని కొనుగోలు చేసి తీసుకొస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి 25 టెట్రాప్యాకెట్ల మద్యాన్ని, వాహనాన్ని పోలీసులు సీజ్ చేశారు. ఇతన్ని మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా, ఆయన ఆదేశాలతో రిమాండుకు తరలించారు. ఎస్ఐ మోహన్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



కొత్తపల్లెలో ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

బంగారుపాళెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. సోమవారం బంగారుపాళెం మండలం తగ్గువారిపల్లె గ్రామ సచివాలయం పరిధిలోని సాయినగర్, పద్మావతినగర్, కొత్తపల్లె గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఎస్ బాబు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను గురించి అడిగి తెలుసుకున్నారు. పథకాల ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాలకు అర్హత కలిగిన వారు ఇంకా ఎవరైనా ఉంటే గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది గుర్తించి అందించాలని సూచించారు. సాయినగర్, పద్మావతినగర్‌లో మురుగునీటి కాలువల సమస్య పరిష్కరించాలన్నారు. కొత్తపల్లెలో అంగన్‌వాడీ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. గుడి నిర్మాణానికి సహకరించాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించి వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, పాలఏకరి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుమార్‌రాజా, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్, సర్పంచ్ వాణిప్రియ, ఎంపీటీసీ సభ్యులు హేమచంద్ర, షబీనా, ఈడిగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎల్లప్ప, నాయకులు శరత్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, దొరస్వామి, సురేంద్ర, ప్రసన్నకుమార్, మహేంద్ర, రఘుపతిరాజు, అధికారులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో లబ్ధిదారుల్లో సంతోషం

జగనన్న సురక్ష కార్యక్రమంతో లబ్ధిదారులు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని జంబువారిపల్లెలో జగనన్న సురక్ష క్యాంప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీల మేరకు పార్టీలకు అతీతంగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేస్తూ ఆర్థికంగా ఆదుకుంటున్నారని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అవసరమైన ధ్రువపత్రాలను అధికారులు, వలంటీర్లు ఇంటి వద్దకే అందిస్తున్నట్లు తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలన్నీ పరిష్కారం అవుతాయన్నారు. కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గ్రామ సచివాలయం పరిధిలోని 400 మందికి కుల, ఆదాయం, వన్‌బీ, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు అందజేశారు. ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ బెన్నురాజ్ పాల్గొన్నారు.



జంబువారిపల్లెలో సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

ఆదర్శ గ్రామాల ఎంపికలో మీరే కీలకం

- ఎంపీడీఓలతో కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ఆదర్శ గ్రామాల నిర్వహణ సర్వేలో ఎంపీడీఓల పాత్ర కీలకమని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకం అమలు తీరుపై సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో మూడు విడతల్లో 60 గ్రామ పంచాయతీలను ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకాన్ని అమలు చేస్తారని తెలిపారు. ఆదర్శ గ్రామ పంచాయతీలకు చేపట్టాల్సిన చర్యలను పకడ్బందీగా పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో మొదటి విడతలో 12 మండలాల్లో 50 శాతం కంటే ఎక్కువ ఎస్సీ జనాభా కలిగిన 23 గ్రామ పంచాయతీల్లో సర్వే నిర్వహించాలన్నారు. 10 అంశాలకు సంబంధించి 50 శాతం ఎస్సీ జనాభా కలిగిన గ్రామాల్లో సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, ఆరోగ్యం, గ్రామీణ రోడ్లు, గృహాలు, విద్యుత్, పింఛన్లు, వ్యవసాయం తదితర అంశాలను సర్వేలో పరిశీలించాలని సూచించారు. 100 శాతం అన్ని సౌకర్యాలు కలిగిన గ్రామాల జాబితాల వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడం జరుగుతుందన్నారు. అలా చేసిన తర్వాత మరోసారి కేంద్ర ప్రభుత్వం సర్వే నిర్వహించి ఆదర్శగ్రామాల జాబితాను ఆగస్టు 15, జనవరి 26 తేదీల్లో ప్రకటిస్తుందన్నారు. ఎంపికయ్యే ఆదర్శ గ్రామాలకు కేంద్రం రూ.20 లక్షల నిధులను అందజేస్తుందన్నారు. ఈ కసరత్తును ఎంపీడీఓలు బాధ్యతగా ప్రత్యేక శ్రద్ధతో నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, డీపీవో లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

చిత్తూరు కలెక్టరేట్ : ప్రపంచ జనాభా వాల్‌పోస్టర్లను కలెక్టర్ షణ్మోహన్ సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1989 జూలై 11ను ఐక్యరాజ్యసమితి ప్రపంచ దినోత్సవంగా వరిస్తూ ప్రకటన చేసిందన్నారు. పెరుగుతున్న జనాభాతో ఉత్పన్నమయ్యే సమస్యలపై అవగాహన కల్పిస్తారన్నారు. స్వాతంత్య్ర అమృత మహోత్సవం సందర్భంగా కుటుంబ సంతోషం, శ్రేయస్సుకు కటుంబ నియంత్రణ పద్ధతులను పాటించాలన్నారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి, మలేరియా అధికారి శ్రీనివాసులు, జిల్లా గణాంక అధికారి జార్జి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

యాదమరి: ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు సోమవారం వైద్య పరీక్షలు చేశారు. వైద్యాధికారి సురేఖ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం చేసుకోవడం సురక్షితమన్నారు. గర్భిణులు పాటించాల్సిన జాగ్రత్తలు, తీసుకోవాల్సిన పోషకాహారం వివరాలను తెలియజేశారు. ప్రతి నెలా 9వ తేదీ ఈ కార్యక్రమం ఉంటుందని.. క్రమం తప్పకుండా పీహెచ్‌సీలో జరిగే వైద్య పరీక్షలకు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సురక్షిత ప్రసవాలే లక్ష్యం

ఐరాల: మాతా, శిశు మరణాలను తగ్గించేలా, సురక్షిత ప్రసవాలే లక్ష్యంగా సేవలు అందిస్తున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణలత అన్నారు. సోమవారం పీహెచ్‌సీలో పీఎం సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రమం తప్పకుండా గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అంగన్‌వాడీలో పంపిణీ చేసే పోషకాహారం సద్వినియోగం చేసుకుని, రక్తహీనత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాన్పు చేయించుకున్న వారికి ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సుగుణవతి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

వైభవంగా జంగమ గురుదేవర

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని బోడిరెడ్డిపల్లి, గడ్డూరులో జంగమ కులస్తుల వీరభద్రస్వామి గురుదేవరను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని మర్రిచెట్టు వద్దకు మంగళవాయిద్యాలు, చెక్కభజనలతో ఊరేగింపుగా వెళ్లారు. ఈ సందర్భంగా వీరభద్రుని ఖడ్గాలను ఎత్తుకుని గురువులు ముందుకు సాగారు. అక్కడ ఏర్పాటు చేసిన మట్టి విగ్రహానికి శాస్త్రోక్తంగా పూజలు చేసి, గురువులు దండకాలను ఆలపించారు. కార్యక్రమానికి వచ్చిన భక్తులు స్వామివారికి పూజాద్రవ్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం వీరభద్రుని హోమం జరిగింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర, మురళీకృష్ణ దంపతులు, ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, నాయకులు చెంగారెడ్డి, ప్రహ్లాద, మండీ సుధా, రవి పాల్గొన్నారు.



జంగమ గురు దేవరలో పాల్గొన్న భక్తులు

13న పుత్తూరులో జాబ్‌మేళా

పుత్తూరు రూరల్: స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్, చెన్నైకి చెందిన కాల్ మాస్ సర్వీసెస్ సంస్థ సంయుక్తంగా ఈనెల 13న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ జి.శ్రీనివాసులురెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మేళాలో పాల్గొనేందుకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన వారితో ప్రస్తుతం డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న వారు అర్హులన్నారు. జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.13 వేలు నుంచి రూ.15 వేలు వరకు ఉంటుందని, ఉచిత వసతి సదుపాయం ఉంటుందని వివరించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే జాబ్‌మేళాకు అభ్యర్థులు సర్టిఫికెట్లతో పాటు, ఒరిజినల్ ఐడీ కార్డుతో హాజరు కావాలని కోరారు. వివరాలకు 7995802325, 9640656775 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

స్పందనలో భూసమస్యలపై అర్జీలు

పూతలపట్టు: స్పందనలో భూ సమస్యలపై అర్జీలు ఎక్కువగా వచ్చాయి. సోమవారం పూతలపట్టు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విజయ భాస్కర్ స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. మ్యూటేషన్, రేషన్ కార్డుల్లో పేర్లు మార్పు, రెసిడెన్షియల్ సర్టిఫికెట్లు వంటివి అధికంగా వచ్చాయి. భూ సమస్యల్లో వీఆర్‌ఓలు, సర్వేయర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఫిర్యాదు చేశారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని వీఆర్‌ఓలకు, మండల సర్వేయర్‌ను తహసీల్దార్ హెచ్చరించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిష్కరించాలని ఆదేశించారు.

నేడు విద్యుత్ అధికారుల సమావేశం

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో చిత్తూరు అర్బన్, రూరల్ డివిజన్ల పరిధిలోని అధికారులతో సాంకేతిక విభాగం డైరెక్టర్ సుబ్బారాజు సమావేశం నిర్వహించనున్నట్లు ఈఈ పద్మనాభపిళ్లై సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు గాంధీరోడ్డులోని డివిజన్ కార్యాలయంలో సమావేశం ఉంటుందని అంతా తప్పక హాజరు కావాలని వివరించారు.

నేడు వలంటీర్ల నిరసన

యాదమరి: జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వలంటీర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై మండల కేంద్రంలో వలంటీర్లు మంగళవారం నిరసన వ్యక్తం చేయనున్నారు. యాదమరి నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి నిరసన అనంతరం స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు వలంటీర్లు తెలిపారు.

ఇన్‌చార్జ్ హౌసింగ్ ఏఈగా శ్రీధర్



శ్రీధర్ (ఫైల్)

పూతలపట్టు: తవణంపల్లె హౌసింగ్ ఏఈగా ఉన్న పి.శ్రీధర్‌ను పూతలపట్టు ఇన్‌చార్జ్ ఏఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. సోమవారం ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసులు పదవీ విరమణ పొందిన విషయం తెలిసిందే.

అంకితభావంతో పని చేయాలి

చిత్తూరు రూరల్: ఆర్టీసీలో అంకితభావంతో పని చేసి డిపో అభివృద్ధికి కృషి చేయాలని అసిస్టెంట్ డిపో మేనేజర్ అల్తాఫ్ అన్నారు. చిత్తూరు నగరం టూ డిపోలో ఆదర్శ కండక్టర్లు, డ్రైవర్లకు సోమవారం అధికారులు అభినందన సభ నిర్వహించారు. ఉత్తమ కార్మికులు కేబీకే రెడ్డి, జీవీ నాయక్, సీఎం కంధన్, అనురాధను ఘనంగా సత్కారించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికులు అంకితభావంతో పనిచేసి లక్ష్యాలను అధిగమించాలని, ముఖ్యంగా ఇంధన పొదుపుపై దృష్టి పెట్టాలన్నారు.

నేడు ముత్తుకూరులో జగనన్న సురక్ష

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం ముత్తుకూరు సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుధాకర్ రెడ్డి సోమవారం తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఉచిత కంటి ఆపరేషన్లకు 25 మంది ఎంపిక

బంగారుపాళెం: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 25 మంది ఆపరేషన్లకు ఎంపికైనట్లు నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటి వైద్య శిబిరానికి విచ్చేసిన 43 మంది కంటి జబ్బు రోగులకు పరీక్షలు నిర్వహించారు. అందులో 25 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. ఎంపికైన వారిని చెన్నైకి తరలించి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించి, మందులు, కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ప్రజాసేవలో వలంటీర్లే కీలకం



వలంటీర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: ప్రజాసేవలో వలంటీర్లే కీలకమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. చిత్తూరు మండలం చెర్లోపల్లి గ్రామంలో సోమవారం వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత వలంటీర్లను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాసేవలో వలంటీర్లు ముందుండి పని చేస్తున్నారని కొనియాడారు. గ్రామాల్లో వలంటీర్లకు కేటాయించిన 50 కుటుంబాల్లో ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించాలన్నారు. వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలని తెలిపారు. వలంటీర్లు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించడంతో పాటు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ ప్రతిమారెడ్డి, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, నాయకులు త్యాగరాజులు, సంపత్, రాజశేఖర్‌రెడ్డి, మోహన్‌వేలు, పూర్ణచంద్రారెడ్డి, దేవేంద్రరెడ్డి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 9 వినతులు

చిత్తూరు అర్బన్ : నగరపాలక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో మొత్తం తొమ్మిది వినతులు అందినట్లు నగర కమిషనర్ జె.అరుణ తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం 'స్పందన' కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలపై నగర ప్రజలు వినతిపత్రాలు అందించారు. ప్రజల నుంచి అందిన వినతులపై శాఖాధిపతులు సత్వరం విచారించి చర్యలు తీసుకోవాలన్నారు. స్పందన కార్యక్రమంలో ఇంజినీరింగ్ 4, ప్రజారోగ్య విభాగం -4 టీపీఓ-1 చొప్పున మొత్తం 09 వినతులు అందాయి. కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డా.లోకేష్, ఎంఈ వెంకట ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

త్వరితగతిన పరిష్కరించాలి..

చిత్తూరు రూరల్: స్పందన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దార్ కిరణ్ అన్నారు. చిత్తూరు నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి వీఆర్‌ఓల వారీగా పరిశీలించాలని ఆదేశాలిచ్చారు. వీటిని నిర్ణీత సమయంలో పరిష్కరించాలని సూచించారు. మొత్తం 19 అర్జీలు వచ్చాయన్నారు.

పేదలకు వరం ఫ్యామిలీ ఫిజీషియన్



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రియాంక



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అరవింద్

తవణంపల్లె: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం పేదలకు వరమని తవణంపల్లె వైద్యాధికారులు ప్రియాంక, మోహన్‌వేలు అన్నారు. సోమవారం మండలంలోని పల్లెచెరువు, గోవిందరెడ్డిపల్లెలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. పల్లెచెరువులో డాక్టర్ ప్రియాంక రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. అదే విధంగా గోవిందరెడ్డిపల్లెలో డాక్టర్ మోహన్‌వేలు వైద్య పరీక్షలు చేశారు. రెండు గ్రామాల్లో 115 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

పాలకలలో ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: మండలంలోని పాలకల-1లో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ అరవింద్ 104 వైద్య శిబిరంలో 85 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, పీహెచ్ఎన్ జీవకళ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



గుడిపాల: వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ ప్రశాంతి

గుడిపాల: గ్రామాల్లో అందించే వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని 104 వైద్యాధికారి ప్రశాంతి అన్నారు. సోమవారం 197రామాపురంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో మండల కేంద్రాల్లోని పీహెచ్‌సీలకు ప్రజలు వచ్చేవారని, ఆ సమయంలో ఇబ్బంది పడేవారన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం మారుమూల ప్రజలకు సైతం ప్రభుత్వ వైద్యం అందించాలన్న ఉద్దేశంతో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టిందని తెలిపారు. అనంతరం షుగర్, బీపీ, గర్భిణులకు చికిత్స చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాంతకుమారి, దివ్య, శిల్ప, శశికళ, అనురాధ, అశ్విని పాల్గొన్నారు.

వీఆర్వో ఫిర్యాదుతో కేసు నమోదు

చిత్తూరు అర్బన్: దూషించి, విధులకు ఆటంకం కలిగించారంటూ వీఆర్వో చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. తాలూకా ఎస్ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి కథనం మేరకు, నగరంలోని 14వార్డు సచివాలయంలో భూమి విషయమై యాదమరికి చెందిన సురేష్ 14వ వార్డు వీఆర్వో మునిరత్నాన్ని దుర్భాషలాడి, విధులకు ఆటంకం కలిగించాడు. దీనిపై వీఆర్‌ఓ సాయంత్రం తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నిర్లక్ష్యానికి తప్పదు మూల్యం



హైవేలో రేడియం స్టిక్కర్ లేకుండా వెళుతున్న ట్రాక్టర్

- రాత్రిపూట ప్రమాదాలకు కారణమవుతున్న ట్రాలీ ట్రాక్టర్లు
- రేడియం స్టిక్కర్లు లేకనే హైవేలో వెళుతున్న వైనం
- వెనుక వచ్చే వాహనాలకు ట్రాక్టర్లు కనిపించక ప్రమాదాలు

పలమనేరు: పట్టణానికి సమీపంలోని చెన్నై-బెంగళూరు, అనంతపూర్-కృష్ణగిరి హైవేలో రాత్రి వేళల్లో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధానంగా ట్రాక్టర్ల ట్రాలీలకు రేడియం స్టిక్కర్లు లేని కారణంగా వెనుక నుంచి వచ్చే వాహనాలు వేగంగా ఢీకొంటున్నాయి. గత నెలలో ట్రాక్టర్ల కారణంగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా, నలుగురు ద్విచక్ర వాహనదారులు గాయపడ్డారు. ప్రస్తుతం జిల్లాలో మామిడి సీజన్ కొనసాగుతోంది. రైతులు మామిడిని ట్రాక్టర్లలో బంగారుపాళెం, పూతలపట్టు, వేలూరు, కాణిపాకం, మదనపల్లె, హోస్కోటకు తరలిస్తున్నారు. ఈ ట్రాక్టర్ల ట్రాలీకి వెనుకవైపు రెడ్‌లైట్లు, రేడియం స్టిక్కర్లు ఉండడంత లేదు. వెనుక వచ్చే వాహనాలకు దగ్గరికి వచ్చేంత వరకు ట్రాక్టర్ కనిపించక పోతుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. 2022లో 711 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. మొత్తం 366మంది మృతి చెందారు. 799మంది గాయపడ్డారు.

అవగాహన కల్పించాం



రవాణా, పోలీసుశాఖల సంయుక్త ఆధ్వర్యంలో హైవేపై వెళ్లే ట్రాక్టర్ల డ్రైవర్లకు అవగాహన కల్పించాం. రేడియం స్టిక్కర్లను స్వయంగా అంటించాం. కాని కొందరు ట్రాక్టర్ యజమానులు రేడియం స్టిక్కర్లు అంటించడంపై నిర్లక్ష్యం చూపుతున్నారు. ప్రస్తుతం మామిడి సీజన్ కాబట్టి హైవేలో వెళ్లే ట్రాక్టర్ ట్రాలీలకు కచ్చితంగా రేడియం స్టిక్కర్ ఉండాల్సిందే. లేని వాహనాలను సీజ్ చేస్తాం. - **మధుసూదన్, ఎంవీఐ, పలమనేరు**